క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ముప్పాళ్ళ: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్ సొమ్మును సచివాలయ సిబ్బంది అందించారు. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన చాగంటి మల్లీశ్వరి అనే మహిళ వికలాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం మంజూరు చేసిన జాబితాలో మల్లీశ్వరి పేరు కూడా ఉండటంతో ఆమె మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లుగా సచివాలయ సిబ్బంది తెలుసుకున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఏలూరి అయ్యప్ప రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డిలు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మల్లీశ్వరికి పింఛన్ సొమ్ము అందించారు. ఆసుపత్రిలో ఉన్నా కూడా తెలుసుకొని ఇక్కడి వచ్చి డబ్బులు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని మల్లీశ్వరి చెప్పారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



క్రోసూరు: కనీస వేతన చట్టం అమలు చేయాలంటూ మండలకేంద్రమైన క్రోసూరు ఆమంచి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆశ వర్కర్ల యూనియన్ సమావేశం జి.సీత అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వారంతపు సెలవులు కూడా ఇవ్వకుండా 24 గంటలు పనిచేపిస్తూ కనీస వేతన చట్టం అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని అన్నారు. పైగా ఎన్సీడీ సర్వేలు, వ్యాక్సిన్ క్యారియర్లు, ఏఎన్ఎంలు తీసుకుని రావాల్సి ఉండగా ఆశా వర్కర్లను ఒత్తిడి చేసి ఆ పనిని వారి చేత చేయిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే అందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ కుమారి, మండల కమిటీ అధ్యక్షురాలు డి.కోటేశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు షేక్ మెహరున్నీసా, ప్రధాన కార్యదర్శి దుర్గాబాయి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ముప్పాళ్ళ: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ కిశోర్ గురువారం తెలిపారు. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన తోట మాధవికి పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన జయకృష్ణతో 2018లో వివాహమైంది. పెళ్లైన పది రోజుల నుంచి జయకృష్ణ మద్యం సేవించి తల్లిదండ్రులైన రాజేశ్వరి, భానుమూర్తిలతో కలిసి అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురి చేస్తుండటంతో అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుంది. ఐదు సంవత్సరాలైనా కాపురం చక్కదిద్దే ప్రయత్నం చేయకపోగా మరింత ఇబ్బందులకు గురి చేస్తుండటంతో ముగ్గురి పైన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిశోర్ తెలిపారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా కరుణకుమార్

దాచేపల్లి: మండల తహసీల్దార్‌గా జి.కరుణ కుమార్ నియమితులయ్యారు. మేడికొండూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణకుమార్‌ను దాచేపల్లి తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్ పనిచేసిన టి.ప్రవీణ్‌కుమార్‌ను చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు సరెండర్ చేశారు.

పట్టణ సీఐ బాలకృష్ణ బాధ్యతలు స్వీకారం



గురజాల: పట్టణ సీఐగా టి.బాలకృష్ణ బుధ వారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు టి.బాలకృష్ణ మాచర్ల సీఐగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు గురజాల సీఐగా విధులు నిర్వహించిన కె.ప్రభాకర్ పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా కొనసాగనున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐను ఎస్ఐలు టి.అశోక్‌కుమార్, బి.అనంతకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

గ్రామాల్లో ఉత్సాహంగా నూతన పెన్షన్ల పంపిణీ



మల్లాదిలో మహిళకు నూతన పెన్షన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్చంపేట: అన్ని కోణాలలో పరిశీలించి అర్హతే ప్రామాణికంగా నూతన పెన్షన్‌దారులను ఎంపిక చేయడం జరిగిందని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న గ్రామ సభల ద్వారా నూతనం 552 మందికి నూతన పెన్షన్లు మంజూరు చెసినట్లు చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో సుమారు 5000 మందికి పైగా నూతన పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి యేటా యేడాదికి రెండుసార్లు పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనవరి నుంచి జూన్‌వరకు దరఖాస్తు చేసుకున్నవారికి జూలైలో, జూలై నుంచి డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో మంజూరు చేస్తూ వచ్చామన్నారు. ఈ యేడాది జూలై 1 నుంచి 27వరకు మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏ కారణాలవల్ల వచ్చే పెన్షన్లు మధ్యలో ఆగిపోయాయి, నూతనంగా దరఖాస్తు చేసుకున్నవారికి ఎందుకు మంజూరు కాలేదో గ్రామ వలంటీర్లు, స్పెషల్ టీంల ద్వారా వివరాలు సేకరించడం జరిగిందన్నారు. వారికి కావలసిన ధ్రువపత్రాలను పంపిణీ చేసి ఆగిపోయిన పెన్షన్లను కొనసాగించడం, నూతనంగా దరఖాస్తు చేసుకున్నవారు అర్హులైతే కొత్త పెన్షన్లు రెండు స్పెల్‌లలో మంజూరు చేయడం జరిగిందన్నారు. మొదటి స్పెల్‌లో 216, రెండవ స్పెల్‌లో 338, మొత్తం



సత్తెనపల్లి ఒకటో వార్డులో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వి.కోటేశ్వరరావు

552మందికి జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడేనాటికి మండలంలో 5050 ఉండగా ప్రస్తుతం 1064 పెన్షన్లు ఉన్నట్లు చెప్పారు. అంటే ఈ నాలుగున్నరేళ్లలో దాదాపుకు రెట్టింపు మంజూరు అయ్యాయన్నారు. మండలంలో అర్హత ఉండి పెన్షను రానివారు దాదాపుకు లేనట్లుగా భావించవచ్చని చెప్పారు. నూతన పెన్షనుదారులలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులు ఉన్నట్లు చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో మండలంలో ఉన్న 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలలో ప్రతి గ్రామం నుంచి సగటున 200కు పైగా నూతన పెన్షన్లు మంజూరయ్యాయన్నారు.

మల్లాదిలో...

అమరావతి: మండల పరిదిలోని మల్లాది గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నూతన పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామంలో నూతనంగా మంజూరైన 17 మంది లబ్ధిదారులకు పెన్షన్‌లను క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంపా వాసు, వెంపా శ్రీను, కోటి సుబ్బారావు పాల్గొన్నారు

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సత్తెనపల్లి పట్టణానికి 189 పింఛన్లను మంజూరు చేసింది. నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను గురువారం వార్డు కౌన్సిలర్ల నేతృత్వంలో వలంటీర్లు,సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, 22వ వార్డులో కౌన్సిలర్ శెట్టి ఆనంద్ పింఛన్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

జగనన్న పారదర్శక పాలనకు ప్రత్యక్ష నిదర్శనం

టీడీపీ నేతకూ నూతన పింఛన్..

నకరికల్లు: పార్టీ, కుల, మత, రాజకీయాలకతీతంగా పారదర్శక పాలన అందిస్తామన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నినాదం. దానికి తగ్గట్లుగా టీడీపీ నేతకు సైతం నూతనంగా వృద్ధాప్య పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన కొమ్మూరి కొండలు గతంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేశాడు. గత ప్రభుత్వంలో డీలర్‌గా కూడా పనిచేశాడు. తనకు 60ఏళ్లు నిండడంతో గ్రామ వలంటీర్ ద్వారా వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతను పూర్తిస్థాయిలో టీడీపీ కోసం పనిచేస్తున్నప్పటికీ అవేమీ



పట్టించుకోకుండా అర్హతే ప్రామాణికంగా సచివాలయం ద్వారా పింఛన్ మంజూరు చేశారు. గురువారం సర్పంచ్ మరియమ్మ మత్తయ్య, ఉప సర్పంచ్ సింగరాజు అంకారావులు కొండలుకు పింఛన్‌ను పంపిణీ చేశారు. దమ్మవళం చినజాలయ్య, దమ్మవళం శ్రీనివాసరావు, అవుదూరి అంజిరెడ్డి, మద్దాల శ్రీనివాసరావు, కోన పుల్లయ్య పాల్గొన్నారు.

సిఫారసు మేరకే పురుగుమందులు వాడాలి

జిల్లా వనరుల కేంద్రం, ఏరువాక కేంద్రం అధికారులు

నకరికల్లు: రైతులకు రెండు అంతకన్నా ఎక్కువమందులు కలిపి పిచికారీ చేసే అలవాటు ఉండడం వలన పురుగులకు మందును తట్టుకునే శక్తి ఏర్పడి ఎప్పటికప్పుడు అధికమోతాదు కలిగిన కొత్తమందులు వాడాల్సి వస్తుందని జిల్లా వనరులకేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్ అన్నారు. మండలంలోని నర్శింగపాడు గ్రామంలోని పొలాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పంటకైనా సిఫారసు మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. గ్రామంలో ఎక్కువగా ప్రైవేటు వరి రకాలను సాగుచేస్తున్నట్లు గుర్తించామన్నారు. తక్కువ కాలపరిమితి గల రకాలు ప్రస్తుతం చిరుపొట్టదశలో ఉన్నాయని అన్నారు. చిరుపొట్టదశలో ఉన్న వరికి ఆఖరి దఫా వేసే యూరియా 25కిలోలకు 20కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలని సూచించారు.



పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, శాస్త్రవేత్త జి.రమేష్

ఆకుముడత పురుగు నష్టపరిమితి స్థాయికంటే చాలా తక్కువగా ఉన్నందున ఎలాంటి పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిరోజు వరిపొలాన్ని గమనిస్తూ అగ్గితెగులు లక్షణాలు కనిపిస్తే ఎకరాకు ట్రైసైక్లోజోల్ 120గ్రాములు లేదా ఐసోప్రొథయోలేన్ 300మిల్లీ లేదా కసుగామైసిన్ 500మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ఉన్నతి రిజిస్ట్రేషన్లు

నకరికల్లు: ఈనెల 20వతేదీన ఉన్నతి కార్యక్రమంపై అవగాహన, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. 18 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగి కనీసం పదోతరగతి నుంచి బీటెక్ వరకు చదివిన యువతీయువకులు అందరూ నమోదు చేసుకోవచ్చని అన్నారు. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పథకంలో 100రోజుల పని పూర్తిచేసుకున్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రూ.27వేల వరకు స్కాలర్‌షిప్ ఉంటుందని అన్నారు. శిక్షణాకాలంలో శిక్షణతో పాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

రాజుపాలెం: వినాయకచవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసేవారు అనుమతులు తప్పక తీసుకోవాలని ఎస్ఐ ఎం.నారాయణ గురువారం తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించేవారు ఐదుగురు అంతకంటే ఎక్కువమంది కమిటీగా ఏర్పడాలన్నారు. మైక్‌కు, విద్యుత్‌కు అనుమతులు పొందాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద ఇసుక, నీటితో నింపిన డ్రమ్ములు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. నిమజ్జన సమయం ముందుగా తెలియజేయాలని, కేటాయించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నకరికల్లు: పోలింగ్‌కేంద్రాల పేర్లలో ఉన్న చిన్నచిన్న తప్పులను సరిచేసేందుకు అన్నిపార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని తహసీల్దార్ కె.నగేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలుపార్టీల ప్రతినిధులతో పోలింగ్‌కేంద్రం రేషనలైజేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మూడుపోలింగ్ కేంద్రాల మార్పు, కొన్ని పోలింగ్ కేంద్రాల పేర్లలో ఉన్న తప్పులను సరిదిద్ది సరైన జాబితాను సిద్ధం చేసేందుకు చర్చించినట్లు తెలిపారు. ఆయా మార్పులకు అన్నిపార్టీల ప్రతినిధులు ఏకాభిప్రాయంతో ఆమోదించారని అన్నారు. పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను పురస్కరించుకొని పట్టణంలోని పోలింగ్ స్టేషన్‌ల పై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలియజేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. పట్టణ వ్యాప్తంగా 42 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా వాటిపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరాలను తెలియ పరచలేదు. అధికారులు సలహాలు, సూచనలను స్వీకరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఎన్. సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ మోహిబ్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో ..

ముప్పాళ్ళ: ఓటర్ల జాబితాల సవరణ–స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు.



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.నగేష్

సమావేశంలో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితాల్లో సవరణపై సలహాలు, సూచనలు అందించవచ్చని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, గుంటుపల్లి బాలకృష్ణ(సీపీఎం), డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం..

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 15న ఉదయం 11 గంటలకు నియోజక వర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ గురువారం తెలిపారు. సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి అధ్యక్షతన సరిగే ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌ల రేషన్‌లైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో మేలు

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తి యజమానులకు శాశ్వత హక్కు కల్పించాలన్న సదుద్దేశ్యంతో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం ప్రవేశపెట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు గురువారం తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమకున్న ఆస్తులకు సంబంధించిన పత్రాల నకళ్లు సచివాలయ వలంటీర్లు, సిబ్బందికి అందజేస్తే వాటికి శాశ్వత హక్కు పత్రం అందజేస్తామన్నారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చంద్రబాబు, పవన్‌ది మిలాఖత్

దాచేపల్లి: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లది ములఖాత్ కాదని, వారిద్దరు జైలుసాక్షిగా మిలాఖత్ అయ్యారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, పవన్ వేరు కాదని తాము ఎప్పటినుంచో చెబుతున్నామని, చంద్రబాబు కోసమే పవన్ పార్టీ పెట్టాడనేది ఇప్పుడు స్పష్టమైందన్నారు. చంద్రబాబు, పవన్ ఒక్కటైనా వైఎస్సార్ సీపీకి ఎటువంటి ఢోకాలేదని, చంద్రబాబు, పవన్, లోకేష్ రాష్ట్రం మొత్తం తిరిగినా ప్రజలు నమ్మటంలేదన్నారు. యాత్రల పేరిట అరాచకాలు చేస్తున్నారని, ప్రజలు తగిన సమయంలో చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు బుద్ధి చెబుతారని రమేష్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోవటం జీర్ణించుకోలేకనే ప్రతిపక్షలు విష ప్రచారం చేస్తున్నాయని, ఎవరి ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం ఖాయమని రమేష్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, నాయకులు పల్లపు హనుమంతరావు, అంజి, వేల్పుల కిషోర్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పత్తిపంట పరిశీలన

రెంటచింతల: పత్తి పంటకు ఆశించే పచ్చ, తెల్లదోమవంటి క్రిమికీటకాలను, రెక్కల పురుగుల నిర్మూలనకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పశర్లపాడు, జెట్టిపాలెం, పాలువాయి గ్రామాలలోని పత్తి పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉన్నప్పుడు ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టకు 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరుసగా పడినా, 10 పత్తిపువ్వులకు ఒక గుడ్డిపువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే దిమోడికాడ్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరీపాస్ 2.5 మిల్లీ లీటర్లను ఒకలీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో తెల్లదోమ ఎక్కువగా ఉంటే ఎకరాకు 20 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరాకు 5శాతం వేపగింజల కషాయం లేదా 250 మి.మీ.ల వేపనూనె గాని డైయజోఫాస్(ఓస్టాతియన్)ను 2.5 మి.లీటర్లను గాని ఏసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితే తెల్లదోమ ఉధృతిని నివారించవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటింటి ఆరోగ్య సర్వే

వివరాలు వెల్లడించిన పీహెచ్‌సీ వైద్యులు

క్రోసూరు: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు చేపట్టాలని గురువారం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ సిరిచందన వైద్యసిబ్బందికి తెలిపారు. పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం నుంచి ప్రతి ఇంటికీ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు వెళ్లి దీర్ఘకాలిక రోగాలు, బాలింతలు, గర్భిణులు, స్కూల్ పిల్లలకు ఏడు రకాల వైద్యపరీక్షలు చేయాలన్నారు. మెరుగైన వైద్యసహాయం అవసరమైన వారికి కేటాయించిన తేదీల్లో శిబిరాలకు హాజరయ్యేలా చెప్పాలన్నారు. వైద్యశిబిరాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్యబృందం రెండు టీంలుగా ఏర్పడి శిబిరాలకు హాజరవుతారన్నారు. వీరితో పాటు ఇద్దరు స్పెషలిష్ట్ వైద్యులు పాల్గొంటారన్నారు.

3 నుంచి మండలంలో...

అక్టోబరు 3వ తేదీన అనంతవరం, యూపీ పాఠశాల, 4న గుడిపాడు, వైఎస్సార్ హెల్త్‌వెల్‌నెస్‌సెంటర్, 5న క్రోసూరు–2 జెడ్పీపాఠశాల, 6న పీసపాడు, ఎంపీయూపి స్కూల్, 7న క్రోసూరు–3(ఎర్రబాలెం), ఎంపీయూపీ స్కూల్, 9న 88త్యాళ్లూరు, జెడ్పీపాఠశాల, 10న బయ్యవరం, జెడ్పీపాఠశాల, 11న ఊటుకూరు, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్,12న అందుకూరు, ఎంపీయూపీ పాఠశాల, 13న ఆవులవారిపాలెం, ఎంపీయూపీ పాఠశాల, 16న హసనాబాద్, సచివాలయం, 17న నాగవరం, ఉర్దూ పాఠశాల, 18న దొడ్లేరు–2 , జెడ్పీపాఠశాల, 28వ తేదీ దొడ్లేరు –1 ,సచివాలయంలో వైద్యశిబిరాలు జరుగుతాయన్నారు.

గురుకుల పాఠశాలలో 'వైఎస్సార్ కంటి వెలుగు'

అమరావతి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య పరీక్షల కార్యక్రమాన్ని అమరావతి మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈసందర్భంగా మేకల హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువగలుగుతారనే నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా గురుకుల పాఠశాలలోని 800 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అలాగే కళ్లద్దాలు నమోదు చేసుకుని వారం రోజులలో ఇవ్వటం జరుగుతుందని కంటి వైద్యాధికారి సుబ్బారావు తెలిపారు. ఎంపీడీఓ పావులూరి ఉమాదేవి, డాక్టర్ మౌనిక, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మేరీ, అత్తలూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు..



బాలికల గురుకుల పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష..

ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అమరావతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు పాల్గొని అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ పద్యపోటీలు

సత్తెనపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని 6వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సదనం సత్యవాణి అన్నారు. హిందీ దివస్ సందర్భంగా రోటరీ క్లబ్, సత్తెనపల్లి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరో వార్డులోని ఎంపీయూపీ స్కూల్ హ్యారిస్‌లో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు హిందీ పద్య పోటీలు, డ్రాయింగ్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సదనం సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు హిందీ భాష గొప్పతనాన్ని తెలియ జేయడం కోసం ఈ పోటీలు ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. హిందీ పద్య పోటీలలో విజేతలైన భవ్య శ్రీ (జెడ్పీహెచ్ఎస్, బాలికల ఉన్నత పాఠశాల), వాత్సల్య (శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్), భాష (ఎంపీయూపీఎస్, హ్యారిస్), హరి (ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్), మనోజ్ఞ వనమా లిఖిత్ గోకుల్ (శ్రీ చైతన్య స్కూల్), డ్రాయింగ్ పోటీల్లో నూర్‌బాషా కరంసా, నూర్ బాషా సమీరా, షేక్ మహమ్మద్ బాష, విజేతలుగా నిలిచారు. విజేతలకు కౌన్సిలర్ సత్యవాణి చేతుల మీదుగా బహుమతులు అందించారు. అలాగే రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులైన పటాన్ లాలూ ఖాన్, పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులైన గర్రె శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరి మిత్రమండలి అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సదనం హరి, రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, సరికొండ రమాదేవి, వనమా నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు శివారెడ్డి, విజయకుమారి, శంషుద్దీన్, వెంకటేశ్వర్లు, మేరీ, జానకి, జ్యోతిర్మయి, పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కౌన్సిలర్ సదనం సత్యవాణి, రోటరీక్లబ్ బాధ్యులు

75 త్యాళ్లూరు జడ్పీలో...

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతి చేసి ఏకతాటిపై నడిపించేందుకు హిందీ భాష దోహదపడిందని హిందీ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మధవిలు చెప్పారు. నరసరావుపేట మండలం శంకరభారతిపురం పాఠశాలలో హిందీ భాషపై నిర్వహించిన క్విజ్‌పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉన్నతాధికారులు చేతుల మీదుగా బహుమతులు అందించారు. విజేతలను ఉపాధ్యాయ బృందం అభినందించారు. యోగ గురువు నాగబాబు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

రెంటచింతల: విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలకు తగిన ప్రాధాన్యంను ఇవ్వాలని అప్పుడే ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి బాలబాలికల అండర్–14, అండర్–17 జట్ల ఎంపికతో పాటు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారుల ఎంపిక ఆటల పోటీలను ఎంపీపీ స్కూల్ కరస్పాండెంట్ రెవ.ఫాదర్ పీటర్ పాపయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. విద్యతోపాటు ఆటలలో కూడా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు తగిన శారీరక వ్యాయామం ఏర్పడి, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

రాష్ట్రప్రభుత్వం కూడ విద్యాభివృద్ధితోపాటు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తుందన్నారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు ఫాదర్ పీటర్ పాపయ్య తెలిపారు. శుక్రవారం బాలురకు ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల ద్వారా విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మండల స్థాయి అండర్–14, అండర్–17 జట్లను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు పాలువాయి జడ్పీ స్కూల్ పీడీ కత్తి రవి తెలిపారు. పీఈటీలు బ్రహ్మయ్య, సురేష్, సుభాని, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొని ఆటల పోటీలను పర్యవేక్షించారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, రెవ.ఫాదర్ పీటర్ పాపయ్య